



www.netifocusnews.com

నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

# తెలంగాణ జిల్లాలు

మంగళవారం 9, సెప్టెంబర్ 2025 పేజీలు 4


# యూరియా పంపిణీలో సర్కార్ సక్సెస్

## పారదర్శకంగా అంతటా రైతులకు యూరియా సరఫరా

## కేంద్రం నిర్లక్ష్యంతోనే తెలంగాణ రైతులకు ఈ గోస



- ఎఫ్‌సీఐలో సాంకేతిక లోపం అంటూ కుంటి సాకు
- వాస్తవాలను విస్మరించి బీఆర్ఎస్ మీడిసిపాటు
- పదేళ్లలో రైతుల తిప్పలు అంతింతా కాదు
- యూరియా కోసం క్యూలో గంటల కొద్ది నిలబడి సొమ్మసిల్లిన వైనం
- ఎండలో నిలబడి గుండెపోటుతో ఓ రైతు మరణించిన విషయం తెలియదా!
- ప్రతిపక్షాలపై మండిపడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు



పాలకుర్తి , (నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్8:

పాలకుర్తి నియోజకవర్గంలోని రైతులు యూరియాను ప్రశాంతంగా తీసుకుంటున్నారు. రాష్ట్రానికి రావలసిన యూరియా కేంద్రం ప్రభుత్వం సరఫరా చేయడంలేదని,అందుకే రైతులందరికి కావల్సినంత యూరియా అందడంలేదనే విషయం ఎప్పటికిప్పుడు రాష్ట్రప్రభుత్వం తెలియజేస్తోంది. ఆగస్టు నాటికి ఖరీఫ్ సీజన్‌కు మిగతా 2లో..

---

# శెభాష్.. పోలీస్..!




## సంస్కృతీ, సాంప్రదాయాలకు ఎస్పీ పెద్దపీట

## డీజేల నివారణతో పెంచిన చైతన్యం

వనపర్తి ప్రతినిధి,
(జి.శ్రీనివాస యాదవ్ జగత్‌పల్లి):

ఈ ఏడాది వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు మండపాలలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా పోలీసు యంత్రాంగం సఫలీకృతమైంది. జిల్లాలో ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు జరిగిన వినాయక చవితి వేడుకలలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అపశృతులు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ నెల, రెండు నెలల ముందు నుంచి జిల్లాలోని పోలీసు స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలతో పాటుగా వనపర్తి డిఎస్పీని అప్రమత్తం చేసి వినాయక ఉత్సవాల ప్రశాంతతపై ప్రచారం కల్పించి మంటపాల నిర్వాహకులలో అవగాహన చైతన్యం పెంపొందించారు. దీనికి అనుగుణంగానే వినాయక మండపాల నిర్వాహకులు పోలీసులను అనుసరించి ముందుకు కదిలారు. ఎక్కడైనా పొరపాట్లు జరుగుతాయేమో, అపశృతి చోటు చేసుకుంటుందేమో అనే అనుమానంతో అనునిత్యం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తనదైన శైలిలో ముందుకు కదిలారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్ని మండపాలు ఉన్నాయి, మిగతా 2లో..



# యూరియా పంపిణీలో రాష్ట్ర సర్కార్ సక్సెస్



## పాలకుర్తి అభివృద్ధికి చేయూతనందించాలి

- మౌలిక వసతుల కల్పనకు సహకరించాలి
- మంత్రి పొంగులేటిని కోరిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి /ఓరుగంటి సైదులు)–సెప్టెంబర్ 8:

పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కోరారు. ఈ మేరకు హైదరాబాదులో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకుర్తి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి,పలు మండలాల్లో రహదారుల సౌకర్యం, భూసంబంధిత సమస్యలు పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇండ్లు మరికొన్ని కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను వేగంగా అమలు చేయాలన్న అంశాలపై ఇరువురు చర్చించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం అత్యంత అవసరమని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థనకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కావలసిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను తీర్చడంలో అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. ప్రభుత్వం పథకాలపై గ్రామీణ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని మంత్రి కోరారు. పాలకుర్తి నియోజకవర్గం లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్రానికి రావల్సిన యూరియా రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో యూరియా నిల్వలు తగినంత లేకపోవడంతో, రైతులు యూరియా సేకరించడానికి పొడవైనక్యూల లో వేచి ఉండటం సర్వసాధారణంగా మారింది. బీఆర్ఎస్ పాలనలో యూరియా పరిస్థితి (2014–2023) బీఆర్ఎస్ పార్టీ(గతంలో టీఆర్ఎస్) అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో రాష్ట్రంలో యూరియా కొరత అనేది లేదని, సకాలంలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యవసాయ అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించి, ప్రతి సీజన్ కు ముందే కేంద్రానికి అవసరమైన యూరియా గురించి నివేదించేవారని బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ తెలిపారు. సకాలంలో యూరియా అందుబాటులో ఉండేలా పక్కా ప్రణాళికలు రూపొందించేవారని ఆయన అన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా రైతు సోదరులకు ఒరగబెట్టింది ఏమిలేదు అని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు ఇప్పుడు సుద్దపోచలా తగుదునమ్మా అంటూ గతాన్ని మరిచి లేని ప్రేమలు ఒలకపోస్తు నీతి మాటలు చెప్పేప్రయత్నం చేస్తుంది అయినా తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. అందుకే కదా.. ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోబెట్టింది. ఆపార్టీ పెద్ద సారు ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయితే.. చోటామోటా నాయకులు ఉనికికోసం పాకులాడుతున్నారు. ఆ కోవలోనే సీనియర్ నాయకులు మాజీ మంత్రి కూడా పాలకుర్తిలో కుప్పిగంతులు వేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టుతున్నాడు అని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు పాలకుర్తి నియోజక వర్గంలోని అన్ని మండలాలలోని యూరియా కేంద్రాల వద్దకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోయి, రైతుల్లా అవతారంమెత్తి ఆందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు మరియు స్థానికులు ఆరోపిస్తున్నారు.



తెలంగాణ ప్రభుత్వం ప్రకారం, ఆగస్టు నాటికి ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్రానికి 8.30లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించబడింది, కానీ కేవలం 5.62 ఎల్ఎంటీ మాత్రమే అందింది. దీని వల్ల దాదాపు 3 ఎల్ఎంటీ కొరత ఏర్పడింది, ఇది రైతులను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ సీజన్‌లో వరి సాగు రికార్డు స్థాయిలో ఉండటంతో సంక్షోభం మరింత తీవ్రమైంది, దీని ఫలితంగా యూరియాకు మొత్తం డిమాండ్ 10.48 ఎల్ఎంటీకి పెరిగింది. రుతుపవనాలు అనుకూలమైన పరిస్థితులను సృష్టిస్తున్నందున, సరఫరా తక్కువగా ఉన్నప్పుడు డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌లో యూరియా ఉత్పత్తి గత రెండు రోజులుగా సాంకేతిక సమస్య కారణంగా నిలిపివేయబడింది, దీనితో ప్రస్తుతం ఉన్న కొరత మరింత తీవ్రమైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో, ఆర్ఎఫ్‌సీఎల్ తెలంగాణకు 60,000 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాల్సి ఉంది. అయితే, జూలైలో ఇలాంటి సాంకేతిక లోపం కారణంగా ఇప్పటికే ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది, అప్పటి నుండి కేవలం 20,000 ఎంటీ మాత్రమే ఉత్పత్తి చేయబడింది. తాజా సమస్య ఆగస్టు 14న జరిగింది. ఈ ప్లాంట్ పూర్తి సామర్థ్యం రోజుకు 2,200 ఎంటీపీడీ అమ్మోనియా మరియు 3,850 ఎంటీపీడీ వేప పూతతో కూడిన యూరియా కీలకమైన ఖరీఫ్ సీజన్‌లో పదేపదే సంభవించే బ్రేక్‌డౌన్‌లు తెలంగాణ రైతులకు యూరియా లభ్యతను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఢిల్లీలోని ఆర్ఎఫ్‌సీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని నివేదించబడినందున సమస్య మరింత తీవ్రమైంది. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాకూర్ ఈ విషయం గురించి గళం విప్పుతున్నారు. తెలంగాణకు ఉత్పత్తిలో 30 శాతం కోటా ఇవ్వాలని, త్వరిత నిర్ణయం తీసుకోవడానికి కార్పొరేట్ కార్యాలయాన్ని రామగుండానికి మార్చాలని,యూరియా రవాణాలో స్థానిక ట్రక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్లను విస్మరిస్తే ఢిల్లీలో నిరసన చేపడతామని ఠాకూర్ హెచ్చరించారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో తెలంగాణకు 50 శాతం ఉత్పత్తి కేటాయింపు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఆ హామీ ఇంకా నెరవేరలేదని ఆయన గుర్తు చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ, ఆర్ఎఫ్‌సీఎల్ తెలంగాణ యూరియా కోటాను లక్ష మెట్రిక్ టన్నులు తగ్గించిందని ఠాకూర్ ఆరోపించారు. ఆగస్టులో కేటాయించిన 65,000 మెట్రిక్ టన్నులకు వ్యతిరేకంగా, ఇప్పటివరకు 20,000 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయబడ్డాయి, ప్లాంట్ మళ్ళీ మూసివేయబడింది. ఇప్పటికే యూరియా కొరతతో సతమతమవుతున్న రైతులు, సాంకేతిక వైఫల్యాలు మరియు అధికార యంత్రాంగం జాప్యాలు సరఫరాకు అంతరాయం కలిగిస్తూనే ఉండటంతో ఇబ్బందుల్లో పడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి రావల్సినంత యూరియా రాకపోవడానికి కారణాలు ఏమిటీ..? ఎవరు బాధ్యులు..? గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఏమేరకు యూరియా పంపిణీ చేశారనే విషయాలాను విస్మరించి రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజల నుండి ఓట్లు రాబట్టుకునేందుకే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దీనిని ప్రజలు గమనిస్తున్నారని స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు వాపోతున్నారు.

## శభాష్.. పోలీస్..!

(మొదటి పేజీ తరువాయి)





ఎన్నింటికి అనుమతులు ఉన్నాయి, మండపాల నిర్వాహకులతో క్షేత్రస్థాయిలో ఎస్పైలు తీసుకుంటున్న చర్యలు,చేపట్టాల్సిన జాగ్రత్తలపై అను నిత్యం అవగాహన కల్పించేందుకు వెనకడుగు వేయలేదు. ఉత్సవాల ప్రారంభ సమయంలోనే జిల్లా ఎస్పీకి కాలుకు గాయం కావడంతో వినాయక ఉత్సవాల పర్యవేక్షణపై ప్రతికూల ప్రభావం పడకూడదని ఎస్పీ తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రతిరోజు మానిటరింగ్ చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. వినాయక ఉత్సవాలు పకడ్బందీగా ఎలాంటి ఘర్షణలు, కొట్లాటలు, తోపులాటలు, బాహాబాహీలు లేకుండా జరగడంతో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, వినాయక మండపాల నిర్వహకులు, పోలీసు శాఖ పనితీరును అభినందిస్తున్నారు.

**ప్రతి అడుగు అవగాహనతోనే..**

వనపర్తిలో వినాయక ఉత్సవాలకు రాజకీయ నాయకుల ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం ఉంటుంది. ఈ క్ర మంలోనే వినాయక మండప నిర్వహకులు ఉత్సవాల ముగింపు సందర్భంగా డిజే ల ఏర్పాటుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. క్షేత్రస్థాయిలో అనునిత్యం పర్యవేక్షణ ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వినాయక మండపాల నిర్వాహకులలో సనాతన ధర్మం, ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఉత్సవాలు చేయాలని మండపాల నిర్వహకులలో పదేపదే అవగాహన కల్పిస్తూ వచ్చారు.



దీంతో కీలక రాజకీయ నాయకుల నుంచి మొదలుకొని ప్రతి ఒక్కరు ఎస్పీ రావుల గిరిధర్ మాటల్లోని ఆంతర్యాన్ని గుర్తించి సనాతన ధర్మం, ఆధ్యాత్మిక శోభాయాత్రకు అడుగులు పడేలా ఎస్పీ చేసిన అవగాహన, హితబోధ గణపయ్య నిమజ్జనం రోజు ఆధ్యాత్మిక వైభవానికి ఆలంబనగా నిలిచింది.

**పర్యవేక్షణ జోష్..**

ఎస్పీ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది అనునిత్యం పెట్రోలింగ్ చేస్తూ ఎక్కడ ఏదైనా పొరపాట్లు ఉంటే దృష్టి సారించి సరి చేస్తూ వచ్చారు. దీనికి తోడు మండపాల నిర్వహకులతో ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరిస్తూ ముందుకు సాగడం ద్వారా వినాయక ఉత్సవాలు ఎప్పుడూ లేని రీతిగా మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్ళు, తప్పెట్లు, పాఠశాల విద్యార్థుల నృత్యాలు, కోలాటాలు వంటి ఆధ్యాత్మికతకు, ప్రశాంత వాతావరణనికి చిహ్నంగా మారాయనడంలో అతిశయోక్తి లేదని భక్తి భావనపరులు అభిప్రాయపడుతున్నారు.

# పోలీసు పెట్రోల్ బంకుపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

### -రాష్ట్ర పోలీసు హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్, ఐజి రమేష్

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి. శ్రీనివాస యాదవ్ జగత్‌పల్లి)



పోలీస్ సంక్షేమ విభాగం నుంచి ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ పంపుపై ప్రజలకు నమ్మకం కల్పించి నాణ్యత ప్రమాణాలు అమలు చేయాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐజి రమేష్ పోలీసు శాఖకు సూచించారు.

సోమవారం వనపర్తి మండలం రాజపేట గ్రామ శివారులో వనపర్తి పోలీస్ శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్తానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ లతో కలిసి పెట్రోల్ బంకును ప్రారంభోత్సవం చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలకు పోలీసులపై విశ్వసనీయత పెరిగిందని అన్నారు. వనపర్తి జిల్లాలో పోలీస్ విభాగం ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇస్తే జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి , స్తానిక శాసన సభ్యులు మెగా రెడ్డి వేగంగా స్పందించి అనతి కాలంలోనే అన్ని అనుమతులు ఇవ్వడంతో షరవేగంగా కేవలం 4 నెలల వ్యవధిలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో భవిష్యత్తులో బైపాస్ రోడ్డు, మదనపురం రైల్వే నుంచి వనపర్తి వరకు కొత్త క్యారిడార్ నాలుగు లైన్ల రోడ్లను నిర్మిస్తే వాణిజ్యపరంగా అభివృద్ధి చెంది మరిన్ని సంస్థలు ఏర్పాటు అవుతాయని తద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మత్స్యశాఖ తరపున 47 కోట్లతో వనపర్తి జిల్లాకు ఎక్స్ పోర్ట్ ఓరియెంటెడ్ యూనిట్ మంజూరు అయిందని తెలిసిందని, అది కూడా నెలకొల్పితే ఈ ప్రాంతం వాణిజ్యపరంగా బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. పోలీసుల మీద పెరుగుతున్న నమ్మకానికి అనువుగా పెట్రోల్ పంపు నిర్వహణలో పారదర్శకత, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే ప్రజల ఆదరణ మరింత పొందుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇండియా జస్టిస్ రిపోర్టులో భారతదేశంలోనే తెలంగాణ పోలీసులు ప్రథమ స్థానంలో ఉండడం చాలా గర్వకారాణమన్నారు.

పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగింది - వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘరెడ్డి

పోలీసులు ప్రజలకు అండగా నిలబడి వారి సమస్యలను పరిష్కరిస్తారన్నారు.

పోలీస్ విభాగంపై ప్రజలకి మంచి నమ్మకం ఉండటంతో పట్టణ శివారులో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. పెట్రోల్ బంకుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తారనే నమ్మకం ప్రజలకు ఉంటుందని తెలిపారు. అలాగే రాబోవు రోజుల్లో కొత్తకోట, వనపర్తి క్యారీడర్ ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనలను ఆర్ అండ్ బి మంత్రికి ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పాటుగా వనపర్తికి ఒక బైపాస్ రోడ్డు కూడా పెబ్బేరు కనెక్టింగ్ చేస్తూ ప్రతిపాదించడం జరిగిందన్నారు. అది కూడా మంజూరు అయిందని త్వరలోనే పనులు చేస్తామన్నారు.

నాణ్యత ప్రమాణాలు పెంచితే.. పెట్రోల్ వినియోగం పెరుగుతుంది - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

జిల్లాలో ఏర్పాటుచేసిన పోలీస్ పెట్రోల్ బంక్ లో క్వాలిటీ, క్వాంటిటీ పారదర్శకంగా ఉంటుందని అన్నారు. అందుకు అనుగుణంగా నాణ్యత ప్రమాణాలు పెంచితే మరింతగా పెట్రోల్ వినియోగం జరుగుతుందని అన్నారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రత్యేక చొరవ తీసుకొని కొద్ది నెలలోనే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం కీలక పరిణామం అన్నారు. ఎస్పీ రావుల గిరిధర్ తో పాటు వారి సిబ్బందిని అభినందించారు. త్వరలోనే అంతే వేగవంతంగా మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే పెట్రోల్ బంకులను పూర్తిచేయాలని ఐఓసీఎల్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐఓసిఎల్ అధికారులు సుమిత్ర, శరణ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



# గణేష్ లడ్డు దాతకు ఘన సన్మానం

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజ మహల్ (పాలిటెక్నిక్) ఎదుట ప్రతిష్టించిన గణనాథుడి లడ్డువేలంలో జగదాంబ జ్యువెలర్స్ అధినేత సమధాన్ దంపతులను మండప నిర్వాహకులు ఘన సన్మానం చేశారు. సోమవారం సమాధాన్ నివాసానికి వెళ్లి వారి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. గణనాథుడి లడ్డూ వేలంలో ఎన్నడూ లేని విధంగా వనపర్తి జిల్లాలో ఏకంగా 801116 రూపాయలు పలికి తమ భక్తిని చాటుకున్నారని వారు కొనియాడారు. గణనాథుడి ఆశీస్సులతో వారి వ్యాపారం బాగా వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షులు నగేష్, ఆర్ బి. రవి సాగర్, గట్టు వెంకన్న, ఎలక్ట్రిసిటీ వెంకటేష్, ఉప్పల భాస్కర్, కమతం చెన్నయ్య, బాల ప్రతాప్, రాము, నరేష్, శ్రీకాంత్, శరత్, సంఘకర, శివ తదితరులు పాల్గొన్నారు.

# లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించే కుట్రలను సహించం - లంబాడీ జేఏసీ

ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 08





పెద్దవంగర మండలంలోని ఎల్బీ తండాలో లంబాడీ జేఏసీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గ కో కన్వీనర్ మాలోతు సురేష్ బాబు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని కొంతమంది చేస్తున్న కుట్రలను ఎవ్వరూ సహించరని స్పష్టం చేశారు.

ఈ నెల 9న హనుమకొండ జిల్లాకేంద్రంలో జరగనున్న లంబాడీల శాంతి ర్యాలీకి ప్రతి లంబాడి బిడ్డ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా లంబాడీలను ఏమి చేయలేరని, ఇది కేవలం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నమేనని ఆయన విమర్శించారు. ఇది డైవర్షన్ పాలిటిక్స్ తప్ప మరేమీ కాదని అన్నారు.

రాజ్యాంగ బద్ధంగా తెలంగాణలో లంబాడీలను షెడ్యూల్ ట్రైబ్స్‌గా గుర్తించారని, 1978 మే 3న విడుదల చేసిన జీవో నంబర్ 149ను గుర్తుంచుకోవాలని సూచించారు. రాజ్యాంగంలోని 342వ ఆర్టికల్ ప్రకారం తెలంగాణ ప్రాంతంలోని లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చారని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో లంబాడీ జేఏసీ నాయకుడు ధరావత్ సంతోష్ ఆధ్వర్యంలో బంజారా యువకులు తరుణ్ నాయక్, రాజు నాయక్, నవీన్ నాయక్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం

పెద్ద వంగర ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 08



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుమాధవ్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీడీవో వేణుమాధవ్ మాట్లాడుతూ.. "ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓటరు జాబితాలో వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, నిజమైన అర్హులైన ఓటర్లకు ఎటువంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. తదుపరి పార్టీ నాయకులతో చర్చిస్తూ, వారు లేవనెత్తిన అంశాలను నోట్ చేసుకొని, సంబంధిత అధికారులకు నివేదిస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల ప్రవాస్ కార్యక్రమం ఉప్పెన



పెద్దవంగర ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 08

మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవాస్ యోజనలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరాచారి ఆధ్వర్యంలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాము గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా నాయకుడు దరావత్ శ్రీను నాయక్ ప్రవాసీగా పాల్గొన్నారు. ముందుగా ఉప్పరగూడెం శివాలయం, రామాయణంలోని దేవాలయాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మండల కేంద్రంలో 'చాయ్ పై చర్చా' నిర్వహించి స్థానిక సమస్యలపై చర్చ జరిపారు. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ప్రభారీలతో సమావేశమై ఎన్నికల వ్యూహరచనపై చర్చించారు. తరువాత ఎల్‌బీ తండా, చిట్యాల, కిస్టు తండా, బొమ్మకల గ్రామాలలో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమాలలో మండల ప్రధాన కార్యదర్శి కొయ్యడి ముఖేష్, బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు మెరుగు సందీప్ కుమార్, మండల కార్యదర్శులు సుధాకర్, శంకర్, కిరణ్, బాలూ, దాసు, శ్రీకాంత్, సాయి, చరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అనుపమకు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సత్కారం

తొర్రూరు ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఒరుగంటి సైదులు సెప్టెంబర్ 08



అనుపమకు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన సందర్భంగా మండలంలోని నాంచారి మదూరు జయంతి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ టీచర్ నాయని అనుపమను సహచర ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. మండలంలోని నాంచారి మదూరు జయంతి కాలనీ జెడ్పి ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అనుపమను పాఠశాల హెచ్ఎం కొలుపుల వీరన్న, ఉపాధ్యాయ బృందం శాలువాతో సత్కరించారు.

గురుపూజోత్సవం సందర్భంగా పట్టణంలోని నితిన్ భవన్ లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, వందేమాతరం ఫౌండేషన్ డైరెక్టర్ తక్కెళ్ళపల్లి రవీంద్ర చేతుల మీదుగా అవార్డును ఆమె అందుకున్నారు. విద్యార్థులకు భౌతిక శాస్త్రం ను సులువుగా అర్థం చేయించడం, విద్యార్థులకు ఆ సబ్జెక్టుపై ఆసక్తి పెంపొందించేందుకు ఆమె చేస్తున్న కృషిని గుర్తించిన విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అనుపమను ఎంపిక చేసింది.



ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు అనుపమ మాట్లాడుతూ...ఈ పురస్కారం తన బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో భౌతిక శాస్త్రంలో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని తెలిపారు. అవార్డు రావడానికి సహకరించిన విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపేందర్, కేదారి, హారిక , రాధా దేవి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

# చెల్లి బాగున్నావా..

## పలకరించిన.. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఒరుగంటి సైదులు సెప్టెంబర్ 08



పాలకుర్తి నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి రూ.21 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మైనారిటీల సంక్షేమ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి ఆప్యాయతతో ఎమ్మెల్యే ని చెల్లి బాగున్నావా? అని పలుకరించడంతో అన్నా నేను బాగున్నాను, మీరు బాగున్నారా?" అని ప్రత్యుత్తరమిచ్చారు.ఇరువురి మధ్య ఈ సోదరభావపూర్వక సంభాషణ స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పింది.

అనంతరం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని తండాలు, గూడాలలో రహదారుల దయనీయ పరిస్థితిని వివరించారు. గత పది సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రహదారుల మరమ్మతులకు తక్షణం నిధులు కేటాయించాలని మంత్రి ని అభ్యర్థించారు.ఎమ్మెల్యే అభ్యర్థనను ఆలకించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెంటనే స్పందించి రూ.21 కోట్ల రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి ప్రజల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల మంజూరుతో తండాలు, గూడాలకు సౌకర్యవంతమైన రోడ్లు ఏర్పడి, ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## సిలిండర్ పేలిన విషయాన్ని తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించిన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి

నేటి ఫోకస్ న్యూస్ కౌడిపల్లి సెప్టెంబర్ 8

కౌడిపల్లి మండల కేంద్రంలోని ముట్రాజ్ పల్లి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ తల్లి శారదా బాయి. కొంతకాలం కిందట మరణించడంతో. తల్లికి సంవత్సరికం జరుపుకోవడం కోసం బంధువులు రావడంతో పాటు ఇంట్లో పనులు జరుపుకుంటున్న సందర్భంగా అనుకోకుండా గ్యాస్ లీక్ కావడంతో శ్రీనివాస్ ఇంట్లో నుండి అందరిని బయటకు పంపించిన అనంతరం ఇంట్లో సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం కావడంతో పాటు నిత్యవసర సరుకులతో పాటు ఆస్తి నష్టం సంభవించింది. ఇంటిలో నుండి మంటలు ఒక్కసారిగా రావడం తెలుసుకోవడంతో నర్సాపూర్ నుండి ఫైర్ ఇంజన్ కౌడిపల్లి ఎస్సై అక్కడికి చేరుకొని దుర్ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించడం జరిగింది విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు.

సుహాసిన్ రెడ్డి. వారు మాట్లాడుతూ అక్కడ సంఘటన అంతా సందర్శించి వారితో చర్చించి వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇల్లు వారికి వచ్చేలా పై అధికారులతో మాట్లాడుతా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు హెల్మెట్ల పంపిణీ

తొర్రూరు ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఒరుగంటి సైదులు సెప్టెంబర్ 08



ఉద్యోగులకు హెల్మెట్లను బహుకరించిన ప్రాథమిక పాఠశాల వెలికట్ట ప్రధానోపాధ్యాయురాలు వి. ఉమాదేవి. సోమవారం తొర్రూరు మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సొంత డబ్బులతో ఉద్యోగులందరికీ వాహనాల మీద ప్రయాణిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి ప్రాణాలకు రక్షణ కలిగించే విధంగా అందరూ క్షేమంగా ప్రయాణించాలని ఉద్దేశంతో ఈ ఉద్యోగులకు హెల్మెట్ సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ హెల్మెట్లను స్థానిక మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల వెలికట్ట ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.